



బ్యాంకు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

వార్షిక రుణ లక్ష్యం రూ 20,390 కోట్లు

- వ్యవసాయం, పారిశ్రామిక, ప్రాధాన్యతా రంగాలకు విరివిగా రుణాలు
- లక్ష్యాన్ని సాధించాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

మచిలీపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయం, పారిశ్రామిక, ఇతర ప్రాధాన్యత రంగాలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20,390 కోట్ల రుణాలు అందించేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో వివిధ బ్యాంకు అధికారులతో గురువారం జిల్లా వార్షిక ప్రణాళికపై ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం ద్వారా వివిధ రకాల వ్యాపారాల స్థాపన నిమిత్తం రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ముద్ర, విద్యారుణాలు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు జిల్లాలో 7.52 లక్షల మంది రైతులకు రూ.10,062 కోట్లను పంటరుణాలు, లాంగ్‌టర్మ్ రుణాలుగా అందజేయాలన్నారు. ఎమ్మెస్ఎంఈ ద్వారా 46,606 మందికి రూ.2,864 కోట్ల రుణాలుగా అందించాలని లక్ష్యంగా నిర్దేశించినట్టు తెలిపారు.

ఉదారంగా రుణాలు మంజూరు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన పథకాలకు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా నిరుద్యోగులకు ఏసీ మెకానిజం, ఫొటోగ్రఫీ, పుట్టగొడుగుల పెంపకం, మగ్గంవర్క్, తదితర అంశాల్లో పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి బ్యాంకు లింకేజీ రుణాలను అందజేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలుచేసే పథకాలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయి సమాచారం చేరవేయాలన్నారు. కౌలు రైతులకు పంటరుణాలు అందించే అంశంలో ఎదురవుతున్న ఇబ్బందులను పలు బ్యాంకు అధికారులు వివరించారు. నిబంధనల మేరకు కౌలు రైతులకు గుర్తింపుకార్డుల ఆధారంగా పంటరుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. తొలుత లీడ్‌బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్ గత సమావేశపు చర్చా నివేదికను వివరించారు. ఈ సమావేశంలో నాబార్డు ఏజీఎం మిలింద్, ఇండియన్‌బ్యాంక్ మేనేజర్ రాజేష్, కేడీసీసీబ్యాంక్ జీఎం చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ఆర్.వెంకట్రావ్, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్, మెప్మా పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

9 నెలల్లో కొత్త టెర్మినల్ పూర్తి

▸▸ నిర్మాణ పనులపై ఎంపీ కేశినేని చిన్ని సమీక్ష

6లో..



పనిచేయని ఆకుమర్రు మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్‌లు

- ఆకుమర్రులో మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్‌బెడ్‌లు
- త్వరితగతిన బాగు చేయకుంటే తాగునీటికి కష్టాలే
- మంగినపూడి మంచినీటి పథకంపై పెనుభారం
- 102 గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం
- మంత్రి ఆదేశాలతో కలెక్టర్ బాలాజీ పరిశీలన
- అంచనాలు కలెక్టర్‌కు పంపిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

తాగునీటి పథకాలు అస్తవ్యస్తం

ఫిల్టర్‌బెడ్‌లు పనిచేయక మండలంలో తాగునీటి పథకాలు పడకేశాయి. వందకుపైగా పల్లెలకు తాగునీటి సరఫరా అస్తవ్యస్తమైంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా మరమ్మతులకు గురై పనిచేయడం ఆగిపోయిన ఆకుమర్రు తాగునీటి పథకంలో ఫిల్టర్‌బెడ్‌లు రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. మంగినపూడి మంచినీటి పథకంపై ఆ భారం పడింది. ఇప్పుడు అందులోనూ నీరు ఫిల్టర్‌కాక మూలనపడే స్థితి ఏర్పడింది. మరమ్మతులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలతో కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనాలు రూపొందించి కలెక్టర్‌కు పంపారు. ఆమోదం పొంది నిధులు వచ్చిన వెంటనే పనులు మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలంలోని 58 గ్రామాలకు ఆకుమర్రు మంచినీటి పథకం తాగునీటిని అందిస్తోంది. తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద 22 ఏళ్ల క్రితం ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులోని రా వాటర్‌ను తోడి ఆకుమర్రులోని నాలుగు ఫిల్టర్‌బెడ్‌ల ద్వారా నీటిని శుద్ధి చేస్తారు. అక్కడి నుంచి 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న శారదానగర్‌లోని సంప్‌లకు పంపింగ్ చేస్తారు. శారదానగర్ సంప్‌ల నుంచి ఆయా గ్రామాలకు రక్షిత తాగునీటిని సరఫరా చేస్తారు.

పనిచేయని ఫిల్టర్‌బెడ్‌లు

ఆకుమర్రు మంచినీటి పథకంలో నాలుగు ఫిల్టర్‌బెడ్‌లు మూడేళ్ల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. వీటి ద్వారా నీటిని ఫిల్టర్ చేయడం నిలిపివేశారు. మరమ్మతుల కోసం గతంలో రూ.45 లక్షలు కేటాయించారు. ఈ పనులకు టెండర్లు పిలవకుండా ఐదేసి లక్షల రూపాయల చొప్పున పనులను విడగొట్టి నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించారు. వైసీపీ కార్యకర్తలపేరున, మచిలీపట్నం మండల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగుల పేరున ఈ పనులను కేటాయించారు. ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతుల పనులు సక్రమంగా చేయకపోవడం, నీరు ఫిల్టర్ అయ్యేందుకు నిపుణులు సూచించిన ఇసుక, ఇతరత్రా మెటీరియల్‌ను అవసరమైన మోతాదులో వాడకపోవడంపై అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులతో పరిశీలించి పనులు సక్రమంగా చేయడం లేదని తేల్చడంతో మరమ్మతులు ఆగాయి. రెండేళ్లుగా ఈ ఫిల్టర్ బెడ్‌లను వదిలేశారు.

మంగినపూడి మంచినీటి పథకంపై భారం

మండలంలోని 44 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు వద్ద మంగినపూడి మంచినీటి పథకాన్ని పదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఆకుమర్రు, మంగినపూడి మంచినీటి పథకాలు పక్కపక్కనే ఉంటాయి. ఆకుమర్రు మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్‌లు పాడైపోవడంతో మంగినపూడి మంచినీటి పథకం ద్వారా ఆకుమర్రు మంచినీటి పథకం పరిధిలోని గ్రామాలకు కూడా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇటీవల తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులోని నీరు అడుగంటి చిక్కగా మారింది. దీంతో నీరు త్వరితగతిన ఫిల్టర్ కావడంలేదు. ఎనిమిది గంటల్లో ఫిల్టర్ కావాల్సిన నీరు 12 గంటలకుపైగా సమయం పడుతోంది. దీంతో రెండు పథకాల పరిధిలోని గ్రామాలకు సురక్షిత తాగునీరు ఇవ్వడం కష్టమైపోతోంది.

మరమ్మతులకు మంత్రి ఆదేశం

ఆకుమర్రు, మంగినపూడి మంచినీటి పథకాల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంపై మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు కలెక్టర్ బాలాజీ మూడురోజుల క్రితం తరకటూరు వెళ్లి ఈ రెండు పథకాలను పరిశీలించారు. ఆకుమర్రు మంచినీటి పథకం మూడు ఫిల్టర్‌బెడ్‌లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఫిల్టర్‌బెడ్‌లను పూర్తిస్థాయిలో బాగుచేసేందుకు రూ.54 లక్షల అంచనాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తయారుచేసి కలెక్టర్‌కు పంపారు. ఈ పనులతోపాటు కోన గ్రామం నుంచి పల్లెతుమ్మలపాలెం వరకు పాడైన పైప్‌లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్‌ను వేసేందుకు రూ.50లక్షలతో, చిట్టిగూడూరు వద్ద బైపాస్ పైప్‌లైన్ వేసేందుకు రూ.25లక్షలతో అంచనాలు రూపొందించారు. ఈ పనులు త్వరలో ఆమోదం పొందితే మూడు నెలల్లో పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.

ఈఈ కార్యాలయం గుడివాడలోనే

జిల్లాలో పునర్విభజన జరిగి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం గుడివాడ నుంచి మచిలీపట్నం హెడ్‌క్వార్టర్స్‌కు తరలిరాలేదు. దీంతో జిల్లాలోని 25 మండలాలకు చెందిన పరిపాలన యావత్తూ గుడివాడ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం నుంచే కొనసాగుతోంది. జిల్లాల పునర్విభజన తరువాత రాష్ట్రంలోని 25 జిల్లాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయాలు జిల్లా కేంద్రాలకు మారాయని, కృష్ణాజిల్లాలో మాత్రం గుడివాడలోనే కొనసాగిస్తున్నారని ఇంజనీర్లు చెబుతున్నారు. ఫైళ్ల ఆమోదం కోసం గుడివాడకు, సమీక్షా సమావేశాలకు మచిలీపట్నానికి తిరుగుతున్నామని అధికారులు అంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం గుడివాడ నుంచి మచిలీపట్నానికి తరలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కోరుతున్నారు.



మృతుడి సోదరుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తహసీల్దార్

ఇంకొకరు...

అల్ట్రాటెక్ ప్రమాదంలో మూడుకు చేరిన మృతుల సంఖ్య

జగ్గయ్యపేట రూరల్, జూలై 12 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పరిటాల అర్జునరావు గురువారం రాత్రి మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. శుక్రవారం మధ్యాహ్నానికి గ్రామానికి చేరిన మృతదేహాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ శ్రీహరి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి సోదరుడికి నష్టపరిహారం కింద రూ.50 లక్షల చెక్కు అందించారు. కాగా, విజయవాడ ఆసుపత్రిలో అర్జునరావు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు గురుసాయి, పవన్ తేజ ఉన్నారు. మృతదేహాన్ని విజయవాడ నుంచి బూదవాడకు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. బంధువులు, కుటుంబ సభ్యుల రోదనల నడుమ అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ముగ్గురి పరిస్థితి విషమం

అల్ట్రాటెక్ కర్మాగార ప్రమాదంలో గాయపడిన 16 మందిలో ఐదుగురికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఇప్పటికే ముగ్గురు మృతిచెందగా, గోపీనాయక్, బొంతు శివనారాయణ, బాణావతు సైదులు పరిస్థితి కూడా విషమంగానే ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

వెంటాడిన మృత్యువు

జగ్గయ్యపేట రూరల్ : విధి ఎంత బలీయమైందో. ఎవరిని ఎప్పుడు ఎలా బలి తీసుకుంటుందో అంతుచిక్కని ప్రశ్న. అర్జునరావు కథ కూడా అలాగే ముగిసింది. ఎలక్ట్రీషియన్‌గా శిక్షణ పొందిన అర్జున్ సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ కంపెనీలో ప్రధానంగా మూడు షిఫ్టుల్లో కార్మికులు పని చేస్తుంటారు. ప్రమాదం జరిగిన రోజు ఆదివారం ఉదయం అర్జున్ బి-షిఫ్టులో పని చేయాల్సి ఉంది. గ్రామంలో ఓ వేడుకకు హాజరయ్యేందుకు గానూ ఆయన ఏ-షిఫ్టుకు వెళ్లాడు. పని పూర్తిచేసుకుని ఇంటికి వెళ్లేందుకు లిఫ్టులో నుంచి కిందకు దిగుతున్న అర్జున్‌కు కిలాన్‌లో సాంకేతిక సమస్య వచ్చిందని సమాచారం అందింది. ఏమైందా.. అని లిఫ్టు దిగి చూస్తుండగానే పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అర్జున్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం నుంచి గురువారం వరకు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

తండ్రి బాటలో..



పరిటాల అర్జున్

పరిటాల వెంకటేశ్వర్లు, వెంకటమ్మల రెండో కుమారుడు అర్జున్. ఎలక్ట్రీషియన్‌గా శిక్షణ పొంది సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్నాడు. వెంకటేశ్వర్లు పెద్ద కుమారుడు సైదులు కూడా అదే కంపెనీలో మైనింగ్‌లో పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు రాంబాబు తండ్రి కాంట్రాక్టు పనులను పర్యవేక్షిస్తూ వ్యవసాయ పనులు చూసుకుంటాడు. వెంకటేశ్వర్లు పదేళ్లు సర్పంచ్‌గా పనిచేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌టీకేల మండల ఛైర్మన్‌గా వ్యవహరించారు. కాంట్రాక్టరుగా మారి చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. మంచి పేరున్న తండ్రి అడుగుజాడల్లోనే అర్జున్ కూడా పెరిగి, అంతే పేరు సంపాదించారు.



వైసీపీ నేతలు పూడ్చేసిన బుడమేరు సరిహద్దు ప్రాంతం

బుడమేరును అమ్మేశారు

బెజవాడ శివారులో స్థలాలుగా మార్చి అమ్మకాలు

- రూ.50 లక్షల భూమిని అమ్మేసిన వైసీపీ నేత
- ప్లాట్లు కొని, ఇళ్లు కట్టుకుంటున్న అమాయకులు
- కబ్జా స్థలాల్లో స్తంభాలు వేసిన అధికారులు

బుడమేరును యథేచ్ఛగా పూడ్చేశారు. ప్లాట్లుగా చదును చేసేశారు. ఆనక దర్జాగా అమ్మకాలు జరిపేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో న్యూ రాజరాజేశ్వరిపేటలో జరిగిన భూ కబ్జా తాజాగా వెలుగులోకి వచ్చింది. స్థానిక వైసీపీ కార్పొరేటర్ ఇష్టానుసారంగా బుడమేరును మెరక చేసి ప్లాట్లుగా విభజించడం, ఇందుకు ప్రభుత్వ శాఖలు సహకరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అజిత్‌సింగ్‌నగర్ : బెజవాడలోని న్యూ ఆర్ఆర్‌పేటలో వైసీపీ నేతల కబ్జా వ్యవహారం వెలుగుచూసింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న సెల్ టవర్ రోడ్డులో బుడమేరును దర్జాగా కబ్జా చేసి చదును చేసిన స్థానిక వైసీపీ నేతలు గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కూడా జరిపేశారు. ఇందులో వివిధ శాఖల అధికారులు సైతం తమ వంతు సహకారం అందించడం విశేషం.

బుడమేరు పూడ్చేసి..

న్యూ రాజరాజేశ్వరిపేట మీదుగా బుడమేరు ప్రవహిస్తూ ఉంటుంది. ప్రవాహం తగ్గడంతో స్థానిక వైసీపీ కార్పొరేటర్ భర్త, మరికొందరు అనుచరులు ఆరు నెలల క్రితం కబ్జాకు తెరలేపారు. బుడమేరును పూడ్చుకుంటూ వెళ్లారు. ఇరిగేషన్ శాఖ కిందకు వచ్చే సరిహద్దును పూడ్చి 500 గజాల స్థలాన్ని చదును చేసి 39/2బీ సర్వే నెంబరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు.

రూ.50 లక్షల పైమాటే..

బుడమేరు వద్ద ఆక్రమించిన ఇరిగేషన్ స్థలాల విలువ రూ.50 లక్షల పైనే ఉంటుంది. ఆరు నెలల క్రితమే గుట్టుచప్పుడు కాకుండా కబ్జా చేసిన నేతలు అప్పట్లోనే ప్లాట్ల కింద విడదీసి గజం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయించారు. స్థానికంగా గజం రూ.30 వేల నుంచి రూ.35 వేలు పలుకుతుండగా, సగం రేటుకే స్థలాలు లభించడంతో చాలామంది కొనుగోలు చేసి మోసపోయారు. అయితే, కబ్జా స్థలాల్లో నిర్మాణాలు జరిగినా ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించలేదు.

విద్యుత్ శాఖ అత్యుత్సాహం

వైసీపీ నేతలు కబ్జాకు పాల్పడిన స్థలాల వద్ద విద్యుత్ శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కబ్జా స్థలాల వద్ద నిర్మాణాలకు అనుకూలంగా ఉండేందుకు గత ఎన్నికలకు 20 రోజుల ముందే కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి స్వామిభక్తి చాటుకున్నారు.

- పంట కాలువల దుస్థితితో ఆందోళనలో రైతులు
- హడావిడిగా చర్యలు చేపట్టిన అధికారులు
- సాగుకు నీటి విడుదలపై అనుమానాలు



పులిగడ్డ వద్ద నీరు లేక వెలవెలబోతున్న పంట కాలువ

దివి తీరంలో

సాగు ఎలా?

కృష్ణా డెల్టాలో చిట్టచివరి ఆయకట్టు అయిన అవనిగడ్డ నియోజకవర్గంలో పంట కాలువల దుస్థితి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. కాలువలు శుభ్రత లేక నియోజకవర్గంలోని చివరి భూములకు సాగునీరు చేరటం బ్రహ్మప్రళయంగా మారింది. నాగాయలంక, కోడూరు మండలాల్లో దాదాపు 5 వేల ఎకరాలకుపైగా పంట వేయకుండా రైతులు వదిలివేసిన దుస్థితి ఏర్పడింది.

అవనిగడ్డ : నియోజకవర్గంలోని నాగాయలంక, కోడూరు మండలాలు, కాలువ చివరి ప్రాంతమైన మోపిదేవి మండలంలో చిట్టచివరి వరకు నీరు చేరటమే అతి పెద్ద సవాల్‌గా మారనుంది. యనమలకుదురు లాకుల వద్ద నుంచి 2వేల క్యూసెక్కుల నీరు కేఈబీ కెనాల్‌కు సీజన్ మొత్తం విడుదల చేస్తే అందులో నుంచి పులిగడ్డ ఎల్ఎఫ్ఆర్ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటిని నాగాయలంక, కోడూరు మండలాలకు పంపిణీ చేస్తుంటారు. మిగిలిన వెయ్యి క్యూసెక్కుల నీటిని కాలువ ఆయకట్టు ప్రాంతాలకు సరఫరా చేయాల్సి ఉంది. పట్టిసీమ వచ్చే నీటి నుంచి యనమలకుదురు కేఈబీ కెనాల్‌కు 2 వేల క్యూసెక్కులు విడుదల చేయటం సాధ్యమవుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

పంటకాలువలోకి చొచ్చుకొస్తున్న ఉప్పునీరు

పంట కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీటి విడుదలలో ఏ మాత్రం లోపం జరిగినా అవనిగడ్డ నియోజకవర్గంలోని నాగాయలంక, కోడూరు మండలాల్లో గుల్లలమోద, నాలి, బసవవానిపాలెం, రామకృష్ణాపురం, ఇరాలి, పాలకాయితిప్ప వంటి ప్రాంతాలకు అవుట్ ఫాల్ స్లూయిస్ ద్వారా పొలాల్లోకి ఉప్పునీరు వచ్చి చేరే పరిస్థితి గడిచిన నాలుగేళ్లుగా కొనసాగుతుంది. అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల దగ్గర కనీస మరమ్మతులు చేపట్టకపోవటంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఫలితంగా ఈ గ్రామాల్లో గత సంవత్సరం సాగును పూర్తిగా నిలిపివేయగా, ఈ సంవత్సరం ప్రత్యామ్నాంగా ఉప్పునీటితో సాగయ్యే రొయ్యల చెరువులు వేయాలన్న ఆలోచనలో రైతులు ఉన్నట్టు తెలుస్తోంది. దీనికితోడు పులిగడ్డ దిగువన పంట కాలువల మరమ్మతులు చేయకపోవటం, దివి ప్రాంతానికి వరప్రదాయిని వంటి పులిగడ్డ అక్విడెక్ట్ పరిరక్షణ కోసం ఎలాంటి చర్యలూ చేపట్టకపోవటం వల్ల నీరు వదిలినా చివరి ఆయకట్టు వరకు నీరు చేరేది అనుమానమే అని రైతులు వాపోతున్నారు.

పూర్తిసామర్థ్యంలో నీటి విడుదల సాధ్యమా?

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కనిష్ట స్థాయిలో ఉండటంతో ఈ సంవత్సరం పూర్తిస్థాయిలో నీటి విడుదల సాధ్యమేనా అన్న అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తుండగా, ఈ ఏడాది సాధారణం కంటే అధికంగా వర్షాలు పడే అవకాశాలున్నాయని, ఎలాంటి ఇబ్బంది ఎదురుకాదని, ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు.

హడావిడిగా దిద్దుబాటు చర్యలు

అవనిగడ్డ నియోజకవర్గంలోని పంట కాలువలపై నాలుగేళ్లుగా ప్రభుత్వం అలసత్వం వహించటంతో ఏర్పడిన దుస్థితిపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంటకాలువలు వచ్చే ముందు కాలువలను బాగు చేసే పనులు చేపట్టాల్సి ఉన్నా ఈ సంవత్సరం ఇరిగేషన్ శాఖ కనీసం అంచనాలను కూడా రూపొందించలేదని, వెంటనే ఈ విషయమై స్పందించకుంటే దివి ప్రాంత రైతాంగం తీవ్ర సాగునీటి సంక్షోభం ఎదుర్కొంటుందని వివరించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఇరిగేషన్ అధికారులను పిలిపించి పరిస్థితిని చక్కదిద్దాల్సిందిగా ఆదేశించారు. హడావిడిగా దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన అధికారులు రూ.2 కోట్లతో కేఈబీ కెనాల్ ఆయకట్టు కింద విడ్ రూమువల్ ప్రోగ్రామ్‌కు షార్ట్ టెండర్లను పిలువగా, టెండర్లను ఫైనల్ చేసి పనులు ప్రారంభించేందుకు ఇరిగేషన్ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో రూ.1.6 కోట్ల మొత్తం అవనిగడ్డ నియోజకవర్గానికి కేటాయించింది. మిగిలిన రూ.40 లక్షలను పామర్రు, మచిలీపట్నం నియోజకవర్గాల్లో కేఈబీ కెనాల్ ద్వారా నీరు వెళ్లే పంట కాలువల్లో తూటుకాడ తొలగింపునకు చర్యలు, కలుపు మందు పిచికారికి కేటాయించింది. విడ్ రూమువల్ ప్రోగ్రామ్ ఉండటంతో నీటి విడుదల మరో మూడు, నాలుగు రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈనెల 15వ తేదీ తర్వాత దివి ప్రాంతానికి సాగునీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

9 నెలల్లో కొత్త టెర్మినల్ పూర్తి చేస్తాం

» నిర్మాణ పనులపై ఎంపీ కేశినేని చిన్ని సమీక్ష

గన్నవరం, జూలై 12 : అమరావతి రాజధాని పరిధిలో ఉన్న ఏకైక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గత ప్రభుత్వం విస్మరించి అభివృద్ధి చేయకుండా కొత్త టెర్మినల్‌ను ఆటకెక్కించింది. ముఖ్యమంత్రి చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని కొత్త టెర్మినల్‌ను తొమ్మిదినెలల్లో పూర్తి చేసి ప్రజలకు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎయిర్‌పోర్టు అథారిటీ కమిటీ వైస్ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కొత్త టెర్మినల్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై శుక్రవారం గన్నవరం విమానాశ్రయం కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం జరిగింది. అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయలేకపోవటం గత ప్రభుత్వ అసమర్థతగా పేర్కొన్నారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎయిర్‌పోర్టు టెర్మినల్ అభివృద్ధి పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. విమానాశ్రయంలోని టెర్మినల్‌ను ఏడాదిలోపే కట్టిన ట్రాక్ రికార్డు ఉందని గుర్తు చేశారు. టెర్మినల్ భవన నిర్మాణ పనులపై వారం వారం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రాష్ట్రంలోనే విజయవాడ ఎయిర్‌పోర్టును నెంబర్‌వన్ స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత నెలలో ఇక్కడ నుంచి ముంబైకి విమాన సర్వీసు ప్రజలకు అందుబాటులోకి రాగా ఈ నెల 16 నుంచి ముంబై, ఢిల్లీకి అదనపు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం రాకుండా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రంతో పాటు రాజధానిలో ఉన్న విమానాశ్రయాన్ని కూడా గాలికి వదిలేసిందని మండిపడ్డారు. విమానాశ్రయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్, ఎయిర్‌పోర్టుకి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఐటీ కంపెనీలను తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం కొత్త టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించి ఆరాతీశారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, జనరల్ మేనేజర్ ఎ.రామాచారి తదితరులు పాల్గొన్నారు.


విమానాశ్రయ కొత్త టెర్మినల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



ఇంద్రకీలాద్రికి ఆషాఢ శోభ..

» దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

» ఒక పక్క ఆర్జిత సేవలు, మరోవైపు సారె సమర్పణలు

వన్‌టౌన్, జూలై 12 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం.. శుక్రవారం సందర్భంగా భక్తజనం పోటెత్తారు. పవిత్రమైన రోజు కావడంతో అమ్మవారికి సారె సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్త బృందాలు తరలివచ్చాయి. స్థోమత మేరకు అమ్మవారికి చీరలు, పండ్లు, ఫలహారాలు, వివిధ రకాల తీపి వంటకాలు తదితరాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని అమ్మవారి శీఘ్ర దర్శనం కోసం ఈవో కేఎస్ రామారావుతో పాటు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం శ్రీచక్రనవావరణార్చన, లక్షకుంకుమార్చన, చండీహోమం, ఉదయాస్నే ఖడ్గమాలసేవ, శాంతి కల్యాణం తదితర ఆర్జిత సేవలలో పాల్గొని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎక్కడా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఈవో సుడిగాలి పర్యటన చేశారు. భక్తుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం సందర్భంగా ఉపాలయంగా ఉన్న వల్లీ, దేవసేన, సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. పుట్టలో భక్తులు పాలు పోసి పూజలు చేశారు.




దుర్గమ్మను దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, జూలై 12 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. శుక్రవారం ఆలయానికి పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అధికారులు వారికి అమ్మవారి ప్రసాద, శేషవస్త్రం, చిత్రపటం తదితరాలు అందజేశారు.

విషజ్వరాలతో అప్రమత్తం

» డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి



కూచిపూడి, జూలై 12 : గ్రామపంచాయతీలు తాగునీటి విషయంలో పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని కృష్ణా జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ జెగీతాబాయి పేర్కొన్నారు. శుక్రవారం మొవ్వ పీహెచ్‌సీని ఆమె పరిశీలించారు. మంచినీటిలో లార్వా ద్వారా పలు రకాల జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, తమ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య క్షేమ సమాచారం తెలుసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లాలో 471 ఆర్వో ప్లాంట్లు ఉండగా, ఇప్పటి వరకు 357 ప్లాంట్లలో నీరు పరిశుభ్రంగానే ఉన్నట్టు తెలిపారు. మచిలీపట్నం రూరల్, అర్బన్, పెడన తదితర ప్రాంతాల్లో 32 డెంగ్యూ జ్వరాలు వెలుగు చూసినట్టు తెలిపారు. ప్రాథమిక, వైద్య, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని, జ్వరాలు వచ్చిన వారు వెంటనే ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, ప్రజారోగ్యంపై కలెక్టర్ బాలాజీ ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోగులను ఆమె పరామర్శించారు.

అభివృద్ధికి సహకరించండి : వర్ల రాజా


అధికారులతో సమీక్షిస్తున్న వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై 12 : నియోజకవర్గ అభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల వ్యవధిలో రోడ్ల మరమ్మతులకు రూ1.05 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. జలజీవన్ మిషన్ పథకం పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో పామర్రు, పమిడిముక్కల, మొవ్వ, తోట్లవల్లూరు మండలాల అధికారులతో పాటు జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'నీరు-చెట్టు' పెండింగ్ బిల్లులపై సమీక్ష


'నీరు-చెట్టు' పెండింగ్ బిల్లులపై సమీక్ష చేస్తున్న బీద రవిచంద్ర యాదవ్

వన్‌టౌన్, జూలై 12 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్ పడిన 'నీరు-చెట్టు' బిల్లులపై మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, వీరంకి గురుమూర్తిలతో కలిసి శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, 2015 నుంచి 2019 వరకు 'నీరు-చెట్టు' పథకంలో నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు రూ.1700 కోట్లతో 28 వేల పనులు చేశారన్నారు. దీనికి గాను రూ.1395 కోట్లకు టోకెన్ పడింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ వేధింపులతో చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు 9,331 రిట్ పిటిషన్లు వేశారు. 6625 మంది ధిక్కార పిటీషన్లు వేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.968 కోట్లు జమ కాగా.. కోర్టు ధిక్కరణ పిటిషన్లకు సంబంధించి ఇంకా రూ. 427 కోట్లు బకాయిలున్న విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధి పథకానికి సంబంధించి కూడా రూ. 528 కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ అంశాన్ని కూడా సీఎం చంద్రబాబుదృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. సమావేశంలో పోతుగంటి పీరయ్య కవులూరి రాజా, చంద్రమౌళి, చెన్నుపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


నూతన ఉత్పత్తులు ఆవిష్కరిస్తున్న సంస్థ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి

మార్కెట్‌లోకి.. క్రిషి నూతన ఉత్పాదనలు

లబ్బీపేట, జూలై 12 : క్రిషి రసాయన్ ఎక్స్‌పోర్ట్ క్రిమిసంహారణ ఉత్పత్తిలో 50సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగి దాదాపు 40 దేశాలకు పైగా ఎగుమతి చేస్తున్న అతిపెద్ద భారతీయ బహుళజాతీయ సంస్థ అని కంపెనీ అధిపతులు (సేల్స్ అండ్ మార్కెటింగ్) ఎస్.ఈశ్వర్ రెడ్డి తెలిపారు. బందరోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం క్రిషి రసాయన్ ఎక్స్‌పోర్ట్ అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన క్రిఫాస్ గోల్డ్, క్రిల్ క్రి క్రియేట్ కౌగర్ అండ్ కాక్సీ55 నూతన ఉత్పాదనలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10 మందితో ప్రారంభమై దినదినాభివృద్ధి చెందుతూ 10వేల కంటే ఎక్కువ ఛానల్ భాగస్వాములతో నెట్‌వర్క్ కు నాయకత్వం వహిస్తున్నదని తెలిపారు. 14 పేటెంట్ పొందిన ఆవిష్కరణలు సహా 142 అధిక నాణ్యత ఉత్పత్తులు తమ సంస్థ ప్రత్యేకత అన్నారు. రానున్న రోజుల్లో మరికొన్ని నూతన ఉత్పాదనలతో పంట దిగుబడిని పెంచే ఉద్దేశంతో 1బిలియన్ వ్యాపార లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. నూతనంగా ఆవిష్కరించిన 4ఉత్పాదనలు పత్తి, మిర్చి, వరిలో రసం పీల్చే, గొంగళి పురుగుల నివారణకు సమర్థవంతంగా పనిచేసి అధిక దిగుబడులకు తోడ్పడతాయని తెలిపారు. కాక్సీ 55 శిలీంద్రనాశిని ప్రత్తి, మిర్చి, కాయగూరలు, ఉద్యాన పంటల్లో కాయకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లను సమర్థవంతంగా అరికడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ ఎ.అంజనేయులు, ఫీల్డ్ మార్కెటింగ్ మేనేజర్ సి.హెచ్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బందరును అభివృద్ధి బాట పట్టిస్తా

» మచిలీపట్నం ఎంపీ బాలశౌరి

అవనిగడ్డ, జూలై 12 : మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. శుక్రవారం అవనిగడ్డలో ప్రజా కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో కంపెనీ ఏర్పాటు ప్రక్రియను తుది దశకు తీసుకొచ్చారని బాలశౌరి అన్నారు. సుమారు రూ.70 నుంచి 80 వేల కోట్లతో వస్తున్న రిఫైనరీ కారణంగా బందరు పార్లమెంట్ పరిధిలో 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. నాబార్డు నిధులతో ఎదురుమొండి, ఎడ్లంక వారధిని నిర్మిస్తామని, జల్ జీవన్ మిషన్, ఎంపీ నిధులు, అర్బన్ డెవలప్‌మెంట్ నిధులు, అమృత్-2 నిధులతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి పథకాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, గడిచిన ఐదేళ్లలో జరిగిన అక్రమాలను సరిదిద్దుతామని, మళ్లీ అలాంటివి జరగకుండా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించాలన్న లక్ష్య సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన ఇంచార్జ్ బండి రామకృష్ణ, ఆరు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.


మండలి బుద్ధప్రసాద్, బాలశౌరిలను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

చోడవరం వద్ద రూ. 2500 కోట్లతో ఆనకట్ట

పెనమలూరు : పెనమలూరు మండలం చోడవరం వద్ద నాలుగు టీఎంసీల కృష్ణా నీటిని నిల్వ ఉంచేందుకు రెండున్నర వేల కోట్లతో ఆనకట్ట కట్టేందుకు కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. దీనివల్ల కృష్ణా డెల్టాకు వేసవికాలం సాగునీటితో పాటు మంచినీటి సమస్యకూడా తీరే అవకాశం ఉంటుందని తెలిపారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం కనీస మ్యాచింగ్ గ్రాంటులు ఇవ్వకపోవడంతో ఉయ్యూరు మునిసిపాలిటీకి కృష్ణా నీళ్లను అందించలేకపోయామన్నారు. త్వరలో సీఎం, డిప్యూటీ సీఎం, బందరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి ఈ ప్రాంత అవసరాలను చర్చిస్తామని తెలిపారు. కంకిపాడు నుంచి గుడివాడకు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును నిర్మించే ప్రతిపాదన ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో జనసేన నేతలు ముప్పా రాజా, తాతపూడి గణేష్, టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయం, స్వయం ఉపాధికి ప్రాధాన్యం

» వార్షిక రుణ లక్ష్యాలు సాధించండి

» ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమల్లో భాగస్వాములు కావాలి

» డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో బ్యాంకర్లతో కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 12 : అత్యంత కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతో పాటు స్వయం ఉపాధి కల్పన పథకాలకు ప్రాధాన్యమివ్వాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన బ్యాంకుల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో లీడ్ బ్యాంక్ జిల్లా కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశం (డీఎల్ఆర్‌సీ) జరిగింది. సమావేశాలకు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆర్‌బీఐ ఏజీఎం సీహెచ్ నవీన్‌కుమార్, యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్, కన్వీనర్, ఐఎస్ఎస్ మూర్తి, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులతో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు-బ్యాంకు లీకేజీ, ఆర్థిక సాక్షరత కార్యక్రమాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన అంశాల్లో పురోగతి తదితరాలపై చర్చించారు. తొలుత ఎల్‌డీఎం కె.ప్రియాంక అజెండాలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 90, సెమీ అర్బన్‌లో 122, అర్బన్-మెట్రోలో 326 మొత్తం 538 బ్యాంకు బ్రాంచిలు వున్నట్టు తెలిపారు. అదేవిధంగా మొత్తం డిపాజిట్లు, అడ్వాన్సులు, ఎస్‌హెచ్‌జీలకు అడ్వాన్సులు, కీలక బ్యాంకింగ్ సూచికల్లో పురోగతిని వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనను వివరించారు. ప్రాధాన్య రంగంలో 136.15 శాతం, ప్రాధాన్యేతర రంగంలో 333.91 శాతం మేర లక్ష్యాలను సాధించినట్టు తెలిపారు. మొత్తం లక్ష్యం రూ.39 వేల కోట్లు కాగా రూ.92,651 కోట్లు (237.57 శాతం) మేర అందించినట్టు వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ)కు సంబంధించిన లక్ష్యాలు-సాధించిన ప్రగతిని తెలియజేశారు.


నాబార్డు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బ్యాంకులు, బ్రాంచీల వారీగా ప్రగతి

ప్రజా సంక్షేమం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడంలో బ్యాంకులది కీలకపాత్ర అని, ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా బ్యాంకులు, బ్రాంచీల వారీగా లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ వివరించారు. పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్ర యోజన వంటి పథకాల ద్వారా పూర్తిస్థాయిలో సమాజానికి ప్రయోజనాలు లభించేలా బ్యాంకులు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని, అర్హులైన వారిని స్వయం ఉపాధి దిశగా చేయిపట్టి నడిపించేందుకు కృషి చేయాలన్నారు. ఆర్థిక సాక్షరత కార్యక్రమాలను క్రియాశీలకంగా నిర్వహించాలని, బ్యాంకుల సేవలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సృజన సూచించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలులో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని, సమష్టి భాగస్వామ్యంతో ప్రజల ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని కోరారు. రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను త్వరతగతిన పరిష్కరించి అర్హులకు మేలు జరిగేలా చూడాలన్నారు.


సమావేశంలో భాగంగా జిల్లాకు సంబంధించి నాబార్డు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (2024-25)ను ఆవిష్కరించారు. వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,611 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.8,193 కోట్లు, ఎగుమతుల క్రెడిట్‌కు రూ.93.50 కోట్లు, విద్యా రంగానికి రూ.458 కోట్లు, హౌసింగ్‌కు రూ.1695 కోట్లు తదితర రంగాలకు మొత్తం రూ.24,413 కోట్లకు అంచనాలను విడుదల చేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జీఎం డీఐసీ ఎ.సుధాకర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

పింఛన్ సొమ్ము మింగిందెవరు!

» వీఆర్వోపై కలెక్టర్ చర్యలకు ఆదేశించినా.. పట్టని పోలీసులు

» వాస్తవాలు బయటకొస్తాయని అడ్డుపడుతున్న తహసీల్దార్!

» కలెక్టర్ ఆదేశాలతో.. కొత్త మలుపు తిరిగిన కేసు


కలెక్టర్ జారీ చేసిన లేఖ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి మకిలి పట్టించే విధంగా వృద్ధుల పింఛన్ల సొమ్మును మింగేసిన మైలవరం గ్రేడ్-2 వీఆర్వో తరుణ్ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పింఛన్ల పంపిణీని అపహాస్యం పాలు చేసిన వీఆర్వోపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశిస్తే మైలవరం మండల రెవెన్యూ అధికారులు అతడ్ని కాపాడారు. స్థానిక ఎంపీడీవో కేసు పెట్టినా రెవెన్యూ అధికారులు మాత్రం ఎఫ్ఐఆర్ కాకుండా మేనేజ్ చేశారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. వృద్ధుల సొమ్మును మింగేసిన వీఆర్వోపై తక్షణం ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని కలెక్టర్ సృజన, మైలవరం ఎంపీడీవోను శుక్రవారం ఆదేశించారు. దీంతో ఇప్పటి వరకు వీఆర్వోపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో మైలవరం ఎంపీడీవో కార్యాలయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఫిర్యాదు ఇచ్చి పదకొండు రోజులు గడిచినా పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టకపోవటంతో ఎంపీడీవో కార్యాలయ అధికారులు పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వచ్చారు. దీంతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయానికి పోలీసులు వెళ్లి వీఆర్వోపై ఫిర్యాదు ఇవ్వవలసిందిగా కోరారు. వీఆర్వోపై ఇప్పటికే ఫిర్యాదు చేశాం కదా.. అని ప్రశ్నిస్తే తమ దగ్గర లేదని పోలీసులు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. నాటి ఫిర్యాదు కాపీ ఇవ్వగా.. అది వద్దని ప్రస్తుత తేదీతో మళ్లీ ఫిర్యాదు ఇవ్వవలసిందిగా కోరడంతో ఎఫ్ఐఆర్ కట్టడంలో స్థానిక పోలీసుల నిర్వాకం బయటపడుతోంది. వాస్తవానికి ఘటన జరిగిన రోజునే వీఆర్వోపై ఎంపీడీవో ఫిర్యాదు చేశారు. వీఆర్వో తరుణ్‌పై కేసు విషయంలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. వీఆర్వో తరుణ్ గతంలో సబ్ కలెక్టర్ ఆఫీసు పర్యవేక్షణలో నడిచే పెట్రోల్ బంకులో పనిచేసినపుడు నగదును మాయం చేయటంతో అతనిపై బదిలీ వేటు పడింది. అయినా బుద్ధి మారక చివరకు వృద్ధుల పింఛను సొమ్ము రూ. 48 వేల మేర సొంతానికి వాడేసుకున్నాడు. వీఆర్వో తరుణ్‌పై ఎఫ్ఐఆర్ పెట్టి విధుల నుంచి తొలగించమని కలెక్టర్ ఆదేశించినా చేయకపోవటానికి మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ డబ్బులను వీఆర్వో స్థానిక తహసీల్దార్‌కి ఇచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. తహసీల్దార్ విజ్ఞప్తి మేరకే మైలవరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్న విమర్శలు కూడా వస్తున్నాయి. వీఆర్వో తరుణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే.. వాస్తవాలు ఎక్కడ బయటపెడతాడోనని ఈ పని చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది.

గడ్డి మందు తాగి ఆత్మహత్య



పెనుగంచిప్రోలు, జూలై 12 : నవాబు పేట గ్రామానికి చెందిన తిమ్మసత్తి రవి (52) గడ్డి మందు తాగి శుక్రవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాంబాబు తెలిపిన సమాచారం ప్రకారం.. తిమ్మసత్తి రవి దుస్తుల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టాలు రావటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో గడ్డి మందును కూల్ డ్రింక్‌లో కలిపి తాగాడు. ఇది గమనించిన తల్లి 108కి సమాచారం అందించగా రవిని నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రవిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.


బైక్ ప్రమాదంలో మృతి చెందిన వీఆర్వో

బైక్ అదుపుతప్పి వీఆర్వో మృతి

నందిగామ రూరల్ : అడవిరావులపాడు గ్రామ శివారు కెకంద్రిక అగ్రహారం వద్ద బైక్ అదుపుతప్పి నందిగామ వీఆర్వో కీసర ప్రభాకరరావు (51) మృతి చెందాడు. సేకరించిన సమాచారం ప్రకారం.. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామానికి చెందిన ప్రభాకరరావు నందిగామ పట్టణంలోని ఏడవ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా ప్రభాకరరావు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి వెళ్లి తిరిగి అత్తగారి స్వగ్రామం బొబ్బిళ్లపాడుకు గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. కెకంద్రిక అగ్రహారం వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కందకంలో పడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం అడవిరావులపాడు గ్రామానికి చెందిన పలువురు రైతులు పొలానికి వెళ్తూ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ హనీష్ ఎస్ఐ పండుదొర, తహసీల్దార్ సరస్వతీ, డీటీ, ఆర్ఐ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్స్, జూలై 12 : స్కార్ఫ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో కానూరులోని ఓ కల్యాణమండపంలో మూడు రోజులపాటు సాగే రెండో ఇంటర్నేషనల్ బీ ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నీ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎండీ రవికుమార్, జనసేన పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లాసికల్ ఈవెంట్‌లో భారత్, కెన్యా, పాకిస్థాన్, అమెరికా క్రీడాకారులు బరిలో దిగారు.



బీసీ కమ్యూనిటీ హాల్‌కు రూ. 30 లక్షలు మంజూరు



కంకిపాడు, జూలై 12 : ప్రొద్దుటూరులో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ బాలశౌరి రూ. 30 లక్షలు మంజూరు చేశారని పార్టీ గ్రామాధ్యక్షుడు వీరంకి పావనమూర్తి తెలిపారు. పోరంకి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎంపీ వల్లభనేని బాలశౌరిని కలిసి గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్‌కు 7 సెంట్ల స్థలం ఉందని, అందులో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామపెద్దలు యార్లగడ్డ బుల్లయ్య, ఈడ కోటేశ్వరరావు, ఈడ పరశురామయ్య పాల్గొన్నారు.

విద్య ప్రాముఖ్యతపై అవగాహన

పెనమలూరు, జూలై 12 : అక్షరాస్యతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు తాడిగడప ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సంపూర్ణ అక్షరాస్యతను సాధించడానికి, ప్రతి ఒక్కరిలో కర్తవ్యబోధనను పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రోగ్రాం అధికారి డాక్టర్ కొల్లా నరేంద్ర తెలిపారు.

రెడ్‌క్రాస్ సాయం




అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, వంటపాత్రలు అందజేస్తున్న శంకర్‌నాథ్

గండిగుంట(ఉయ్యూరు), జూలై 12 : గండిగుంట ఎస్సీ కాలనీలో అగ్నిబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సాయం అందించారు. ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో ఇంటితో పాటు సర్వం కాలి కట్టుబట్టలతో మిగిలిన మావులూరి రమాదేవి కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్, కో-ఆర్డినేట్ ఆధ్వర్యంలో వంటపాత్రలు, సబ్బులు, టార్పాలిన్ శుక్రవారం అందజేశారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, కమిషనర్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, జూలై 12: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికుడు యజ్ఞవరపు శ్రీనివాసరావుకు వైద్యఖర్చుల నిమిత్తం స్థానిక మానవత శాఖ సభ్యులు రూ.8,500లు ఆర్థిక సాయం అందజేశారు. బాపులపాడు గ్రామానికి చెందిన బాధితుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ కార్యక్రమంలో మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, సభ్యులు నారగాని కొండలరావు, పీవీచలం, చెక్కా సుబ్బారావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డిరాజేశ్వరరావు, పాల్గొన్నారు.







గ్రామాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
● యువత స్వయం ఉపాధితో ఎదగాలని సూచన



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, దయాల రాజేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 12 : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనను మెరుగుపరచి అభివృద్ధికి కృషి చేస్తానని, మల్లవల్లి పారిశ్రామిక వాడలో పూర్తిస్థాయి పరిశ్రమల ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రేమల్లె గ్రామానికి శుక్రవారం విచ్చేసిన ఆయనకు యనమదల సుధాకర్, వడ్లమూడి జానకిరామ్మూర్తి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు, ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులతో నాగులపల్లి రామచంద్రయ్య కలిసి పాలాభిషేకం నిర్వహించారు.

● చల్లగుళ్ల పాండురంగారావు ఏర్పాటు చేసిన ఎస్.ఎస్. మెడికల్స్, ఫ్యాన్సీ అవుట్‌లెట్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చలమలశెట్టి రమేష్‌బాబు, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, గుండపనేని ఉమావరప్రసాద్, చిరుమామిళ్ల సూర్యం, వర్రాణం హరిబాబునాయుడు, యనమదల శ్రీనివాసరావు, గుడివాడ విజయానంద్, కలపాల రాధాకృష్ణ, కలపాల కుమార్, మాజీ ఎంపీపీ తుమ్మల కోమలి, మూల్పూరి సాయికళ్యాణి, చల్లగుళ్ల లోకేశ్వరరావు, వడ్లమూడి వెంకటకృష్ణారావు, తుమ్మల వీరయ్య, వీరమాచినేని సత్యప్రసాద్, కాటూరి విజయభాస్కర్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

గన్నవరం : వర్షాకాలం సీజన్‌లో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని గ్రామ పంచాయితీ, మెడికల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. తెంపల్లిలో డయేరియా వచ్చి ఆరుగురు మృతి చెందడం బాధాకరమని, డయేరియా మళ్లీ వస్తే అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. సమస్యలు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మట్టి తవ్వకాలపై విచారణ జరగాల్సి ఉందని, అధికారులందరూ సమష్టిగా పని చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. తహసీల్దార్ పవన్ కుమార్, ఎంపీడీవో సత్యకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డను కలసిన అధికారులు

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును పలువురు అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ శారమ్మ, డాక్టర్ మనోహర్‌రెడ్డి వసతి గృహాల వార్డెన్‌లు శ్రీనివాస్, ప్రకాష్, జ్యోతి, ధనలక్ష్మీ, శోభ, దానియేలు పలు శాఖల అధికారులు కలసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



తేలప్రోలు నుంచి ఆత్కూరుకు తీసుకువస్తున్న సారె

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

ఉంగుటూరు, జూలై 12 : ఆషాఢమాసం సందర్భంగా ఆత్కూరులోని జాతీయ రహదారి పక్కన కొలువైవున్న కనకదుర్గమ్మకు శుక్రవారం తేలప్రోలు గ్రామానికి చెందిన భక్తులు ఆషాఢ మాస సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్, తేలప్రోలు మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సారె ఉత్సవంలో మహిళాభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా పట్టుచీరెలు, పసుపు. కుంకుమలు, పూలు, పండ్లు, గాజులు, పొంగళ్లతో కూడిన అమ్మవారి సారెను మేళతాళాల నడుమ సంప్రదాయబద్ధంగా గ్రామపురవీధులలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ గన్నవరం సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు మాట్లాడుతూ, ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కృష్ణాజిల్లాలోని అన్ని మండలాల్లో అమ్మవారికి ఆషాఢమాస సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధికూలీలు

ఉంగుటూరు, జూలై 12 : రెండునెలలుగా పెండింగ్‌లో వున్న ఉపాధి కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎలుకపాడు, ఉంగుటూరు, పొణుకుమాడు గ్రామాలకు చెందిన ఉపాధికూలీలు శుక్రవారం ఉంగుటూరు గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సచివాలయం గ్రేడ్-5 సెక్రటరీ కె.నాగరాజుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పి.రాజారావు, లావూరి బద్దు, బి.అప్పాయమ్మ, వి.కొండయ్య, పి.వెంకటరమణ, వి.నాగమణి, జి.దేవమాత, ఎల్.కస్తూరి, డి.కనకమ్మ పాల్గొన్నారు.

పశుసంపద పెంపొందించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కాటూరులో రైతులకు పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కాటూరు(ఉయ్యూరు), జూలై 12 : పల్లెల్లో సైతం పశుపోషణ నానాటికి తగ్గుతున్న పరిస్థితుల్లో పశుపెంపకం చేపట్టాలిసిన ఆవశ్యకత ఏర్పడిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా కాటూరు పశువైద్యశాలలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ కారణాల వల్ల పట్టణాలతో పాటు పల్లెల్లో సైతం పశువుల పెంపకం తగ్గి రైతులు సైతం పాలప్యాకెట్లు కొనే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గుడివాడ డివిజన్ ఉప సంచాలకుడు సి. శ్రీనివాస్, డీఎల్ డీఏ ఉప సంచాలకురాలు వై. హరిత, ఎం.హరిత, స్థానిక పశువైద్యాధికారి డి. వీణ, సర్పంచ్ ఆశాజ్యోతి, ఎంపీటీసీ అనూష, శ్రీలక్ష్మి, టీడీపీ నాయకులు గుర్రం చంద్రశేఖర్, వేమూరు శ్రీనివాసరావు, కాటూరు శరత్, వి. కుటుంబరావు, వెంకటనారాయణ, సూరపనేని ప్రసాద్, పోతురాజు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

కంకిపాడు : అధికారులు, ప్రజాప్రతినిధులు కష్టపడి పనిచేయాలని, రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు రైతుబజారులో బియ్యం, కందిపప్పు స్టాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలనతో పాటు అభివృద్ధి గాడి తప్పిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పరిపాలన ప్రారంభించిన నాటి నుంచి అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకి రమణ, తహసీల్దార్ రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో భాస్కర్, ఈవోఆర్డీ మైథిలి, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, అన్నే ధనయ్య, సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, వణుకూరు విక్రం, ఏనుగ జయప్రకాష్, పడవల మధుసూదనరావు, జగదీష్, చలవాది రాజ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైనుకు శంకుస్థాపన

పెనమలూరు : యనమలకుదురు పంచాయతీ కార్యాలయం వద్ద సుమారు రూ. 13లక్షలతో కొత్తగా తాగునీటి పైపులైను నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. గతంలో ఉన్న పైపులైను మరమ్మతులకు గురికావడంతో యుద్ధప్రాతిపదికన మంచినీటి పైపులైను పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి బాబూరావు, ముప్పవరపు నారాయణ, ముప్పవరపు నాగేశ్వరరావు, ఆచిన శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి: వైవీబీ



ఉయ్యూరు 15వ వార్డులో షటిల్‌కోర్టు ప్రారంభిస్తున్న రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, జూలై 12 : యువత చెడు వ్యసనాలకు బానిసలు అవ్వకుండా క్రీడలను ప్రోత్సహించడం ద్వారా వారిని సన్మార్గంలో పెట్టిన వారమవుతామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక 15వ వార్డులో యువకుల అభ్యర్థన మేర షటిల్‌కోర్టు ఏర్పాటు చేయించి అవసరమైన సామాగ్రికి ఆర్థిక సాయం అందజేసి శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు జంపన వీరశ్రీనివాస్, అజ్మతుల్లా, పణి, శ్రీకాంత్, తిరుపతయ్య పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

గన్నవరం, జూలై 12 : మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివిన నలుగురు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, ఎ.అరుణ, డి.సాత్వికకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో, డి.హారిక ఇడుపులపాయలో, జి.దీపిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలలో సీట్లు సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

● **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే సమున్నత లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందని ఎంఈవో రాంబాలాసింగ్, సురేష్‌కుమార్ అన్నారు. వీరవల్లి హైస్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు గొట్లాపు భార్గవి, నెరుసు దినేష్‌చంద్ర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన సందర్భంగా హెచ్ఎం నిర్మల ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండపనేని ఉమావరప్రసాద్, మండాది రవీంద్ర, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, అలుగుల దేవానంద్ అభినందించారు.

కల్వర్టు నిర్మాణంపై వాగ్వాదం

విజయవాడ రూరల్, జూలై 12 : నున్న పంచాయతీ సర్వసభ్య సమావేశంలో శుక్రవారం సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. గ్రామం లోని వికాస్ కాలేజీ రోడ్డులోని కొండవీటి వాగుపై కల్వర్టు నిర్మించాలనే విషయమై సభ్యుల మధ్య విభేదం చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వికాస్ కాలేజీ సమీపంలోని పందిపాటి డొంక వద్ద కొండవీటి వాగుపై కల్వర్టు నిర్మించాలని సర్పంచ్ భర్త, 16వ వార్డు మెంబరు కాటూరి శ్రీను ప్రతిపాదన పెట్టారు. అయితే గ్రామ ఎంపీటీసీ పత్తిపాటి నాని ఇతర వార్డు సభ్యులు పత్తిపాటి సుందరయ్య, పెయ్యల రాజాలు ప్రతిపాదనను సమర్థిస్తూనే అంతకన్నా ముందు గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మౌలిక సదుపాయాల ఏర్పాటు అనంతరం రైతులకు ఉపయోగపడేలా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఈవోకు సూచించారు. అలాగే ఇరిగేషన్ శాఖ చేపట్టాల్సిన కల్వర్టును పంచాయతీ నిధులతో ఎలా నిర్మిస్తారని కల్వర్టు నిర్మాణ విషయమై ఇరిగేషన్‌కు ప్రతిపాదన పెడదామని సూచించారు. దీనిపై వార్డు సభ్యుల సూచనలపై ఆగ్రహానికి గురైన కాటూరి శ్రీను గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్న వార్డు సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో బయటకు రా చూసుకుందాం అంటూ వార్డు మెంబర్లు, కాటూరి శ్రీను ఒకరిని ఒకరు దూషించుకున్నారు. అనంతరం ఈవో సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే అసహనానికి గురైన వార్డు మెంబర్లు అలిగి సమావేశం నుంచి నుంచి వెళ్లిపోయారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాటూరి శ్రీను

పెడన పట్టణ సమగ్రాభివృద్ధికి సహకరించాలి

పెడన, జూలై 12 : పెడన పట్టణ సమగ్రాభివృద్ధికి సహక రించాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు ఎంపీ బాలశౌరిని కోరారు. ఆయన దేశం, జనసేన పార్టీల నాయకులతో వెళ్లి బాలశౌరిని కలి శారు. ఎంపీని కలసిన వారిలో వహబ్‌ఖాన్, పూలబాబు, బొడ్డు దీక్షానందుడు, ఇమ్మడి నాగపోతరావు, మట్టా శివ పావని, నాని, ఎలిగట్ల ప్రసాద్ తదితర నాయకులు ఉన్నారు.



ఎంపీని సత్కరిస్తున్న వేణుగోపాలరావు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

అవనిగడ్డ రూరల్, జూలై 12 : ఉద్యాన శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో పులిగడ్డలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి ఎస్?రమేష్ మాట్లాడుతూ నేల సాంద్రత ఆధారంగా ఎరువుల వినియోగించాలన్నారు. రసాయనాలు లేని కూరగా యలు రైతులు పండించాలన్నారు. పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయ కుమార్, చెన్ను రమేష్, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి, విలేజ్ ఉద్యాన సహాయకురాలు సౌమ్య, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోడూరు, జూలై 12 : కోడూరు శివారు ఉల్లిపాలెం గ్రామానికి చెందిన పెద్ద సింగు రాంబాబు అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని నిల్వ చేస్తున్నాడని సమాచారంతో కోడూరు ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో శుక్రవారం ఉల్లిపా లెం బ్రిడ్జి దగ్గర మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసు కున్నా మని, రాంబాబు పరారైనట్లు ఎస్ఐ తెలిపారు.

జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయండి

మచిలీపట్నం టౌన్, జూలై 12 : వాసుదేవ గోశాల ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి మచిలీపట్నం నిజాంపేట బొబ్బిలిపేట వేణుగోపాల స్వామి ఆలయ ప్రాగణం నుంచి జగన్నాథస్వామి వారి రథయాత్ర ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవం తం చేయాలని గోశాల నిర్వాహకులు పల్లపాటి సుబ్రహ్మ ణ్యం కోరారు. జగన్నాథస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీహరి దాస్, పివి ఫణికుమార్, తలారి రాంబాబు, కట్టా సుబ్రహ్మణ్యం, జోగి గోపి తదితరులు మాట్లాడారు.

పామర్రులో వైద్యశిబిరం రేపు

పామర్రు, జూలై 12: పామర్రు సీనియర్ సిటి జన్స్ కార్యాలయం వద్ద ఈనెల 14న ఉదయం 9గం టల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వ హిస్తున్నట్లు నిర్వా హకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలి పారు. ఎన్టీఆర్ ట్రస్ట్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షల తోపాటు ఈసీజీ, కంటి, దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

చంద్రబాబు ముందుచూపుతోనే తాగునీరు

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గుడ్లవల్లేరు/ బంటుమిల్లి, జూలై 12 : నిర్మించకుంటే నేడు కృష్ణా డెల్టా నిర్వీర్యమై ఉండేదని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్ర వారం పట్టిసీమ నుంచి తరలించిన గోదావరి నీటిని గుడ్లవల్లేరు పుల్లేరు నుంచి పోల్‌రాజ్ కెనాల్, బంటు మిల్లి కెనాళ్లకు లాకుల వద్ద నుంచి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, తులసిలు విడుదల చేశారు. తొలుత గోదావరి జలాలకు పూజలు నిర్వహించి రెగ్యులేటర్ గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతులు సాగు నీటికి, డెల్టా ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడకూడదనే లక్ష్యం తో ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. గుడివాడ మాజీ ఎంఎల్ఏ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొలుత తాగునీటి అవసరాలకు పంచాయతీ చెరువులకు నీరు నింపుకొని తరువాత రైతులు సాగుకు నీటిని వినియోగించుకో వాలని విజ్ఞప్తి చేశారు. పెడన నియోజకవర్గ రైతు సంఘ నాయకులు, రైతులు, ఇరు ప్రాంతాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో దాదాపు 75 శాతం వెదలు జల్లారు. ఎమ్మెల్యే కాగిత నీటిని విడుదల చేయడంతో తీర ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గుడ్లవల్లేరులో పోల్‌రాజ్ కెనాల్ లాకు నుంచి తాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాగిత

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కృత్తివెన్ను : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. శుక్రవారం చినపాండ్రాక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. రోగులతో మాట్లాడి వైద్య సేవవలపై ఆరా తీసారు. సిబ్బంది సమయపాలన, సేవలపై తరచూ వస్తున్న ఆరోపణలు ఇక వినపడకూడదని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కృత్తివెన్ను, బంటుమిల్లి మండ లాల అధ్యక్షులు ఒడుగు తులసీరావు, కూనపరెడ్డి వీరబాబు, పిన్నెంటి రత్తయ్య, కూనసాని చిన్న, యాదంరెడ్డి కొండ, చేకూరి వెంకట్రావు, నడకుదిటి అంజనేయులు, రాఘరి తాతాజీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా..

తాడంకి (పమిడిముక్కల) : గ్రామంలో తాగు నీటి సరఫరాపై శ్రద్ధ వహించి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి అన్నారు. గ్రామంలో ప్రధాన ఓవర్‌హెడ్ ట్యాంకువద్ద బోరు ఫెయిల్‌కాగా మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలతో నూతన బోరుపంపు పనులు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి, కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి సుధారాణి

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

గుడివాడ : వాహనం నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని న్యాయమూర్తి ఎం. సుధారాణి పేర్కొ న్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మోటారు వాహనాల చట్టాలను గౌరవించా లన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. వన్‌టౌన్ సీఐ ఎల్.రమేష్, ఎస్సైలు గౌతమ్, నాగరాజు, గరగారావు, విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డా.ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు, కళాశాల ప్రిన్సి పాల్ సి.హెచ్ రవీంద్రబాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐనపూరులో విజయోత్సవ ర్యాలీ

ఐన పూరు(పమిడిముక్కల), జూలై 12 : పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం చేకూర్చిన ప్రజల కు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజ అన్నారు. ఐనపూరులో శుక్రవారం పార్టీ నాయకులు, శ్రేణులు ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధిచేసి మోడల్ నియోజకవర్గంగా మార్చి ప్రజల రుణం తీర్చుకుంటా నన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, దూడల శ్రీను, జక్కా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేశ్ పాల్గొన్నారు.



విజయోత్సవంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

నలుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

పెడన రూరల్ : జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో నాగేశ్వరరావు నాయక్ నిర్వహించిన పంచాయతీ సమీక్ష సమావేశానికి మండలంలోని బల్లిపరు కార్యదర్శి నాగరాజు, లంకలకలవగుంట కార్యదర్శి హవీలా, కాకర్లమూడి కార్యదర్శి శిరీష, పెనుమల్లి కార్యదర్శి హరీష్‌లు సమావేశానికి గైర్హాజరుపై షోకాజ్ నోటీసులు పంపారు. పంచాయతీలలో పాలనాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

పంచాయతీ కార్యదర్శులకు డీపీవో సూచన

చల్లపల్లి, జూలై 12 : పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయా లని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఎస్వీ.నాగేశ్వరనాయక్ సూచించారు. శుక్రవారం చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శుల(గ్రేడ్ - 1 టు గ్రేడ్ - 5)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ ట్యాక్స్‌లు, నాన్ ట్యాక్స్‌ల వారీగా ఉన్న బకాయిల వివరాలు తెలియచేసి గ్రామాలు, మండలాల వారీ గా సమీక్ష నిర్వహించారు. 2024-25 పన్ను వసూళ్ల ప్రారంభించే నాటికి బకాయిల వసూళ్లు పూర్తిచేయాలన్నారు. ప్రణాళికాయుతంగా పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని సాధిం చాలని కోరారు. గ్రామాల్లో డయేరియా రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల న్నారు. నూతనంగా ప్రారంభించిన పంచాయతీరాజ్ - 1 యాప్‌ను అందరూ విని యోగించాలని, యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. హౌస్ ట్యాక్స్ వ్యారిఫికేషన్ డేటాను 100 రోజుల్లో పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సూచిం చారు. గ్రామ పంచాయతీలు వసూలు చేస్తున్న లైబ్రరీ సెస్సును విధిగా సంబంధిత శాఖకు జమచేయాలని ఆదేశించారు. డీఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి ప్రసంగించగా, డివిజన్ పరిధిలోని ఈవోఆర్డీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో ఎస్‌వీ నాగేశ్వరనాయక్

పోస్టల్ ద్వారా రాజీనామాలు చెల్లవు

నందివాడ (జనార్థనపురం) : జనార్థనపురం వైసీపీ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లు నందివాడ ఎంపీడీవో, మచిలీపట్నం డీపీవోకు రిజిష్టరు పోస్టులో పంపిన రాజీనామాలు చెల్లవంటూ పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్ అయితే మచి లీపట్నం డీపీవోకు స్వయంగా వెళ్లి అందజేయాలన్నారు. వార్డు మెంబర్లు ఎంపీ డీవోకు వచ్చి అందజేయాలన్నారు. జనార్థనపురం పంచాయతీ సర్పంచ్ మరి యమ్మతోపాటు 12 మంది వార్డుసభ్యులు రాజీనామాలు చేసినట్లు తెలిపారు.

మేలుజాతి గడ్డితో అధిక పాల ఉత్పత్తి



పెదపారుపూడి, జూలై 12 : మేలు జాతి గడ్డితో పాల ఉత్పత్తిని పెంచుకో వచ్చునని పశు సంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జి.వి.నరసింహారావు అన్నారు. మండలంలోని భూషణగుళ్ల గ్రామంలో శుక్రవారం పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమం నిర్వహించి పచ్చగడ్డి పెంపకం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పశుగ్రాస విత్తనాలు ప్రతీ గ్రామంలోని పశువుల కేంద్రంలో రైతులకు అందించటం జరుగుతుందన్నారు. పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ హెచ్.జయంత్, జేబీవోలు జి.వెంకటేశ్వరరావు, కె.ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ : విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం పట్టణ పరిధిలో శనివారం ఉదయం 8.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామ సచివాలయానికి వాటర్ ప్యూరిఫైర్ వితరణ

కపిలేశ్వరపురం(పమిడిముక్కల), జూలై 12 : కపిలేశ్వరపురం గ్రామ సచివాలయానికి రూ. 70వేలు విలువచేసే వాటర్ ప్యూరిఫైర్, వాటర్‌కూలర్ లయన్స్ క్లబ్ సభ్యుడు తాతినేని రమేశ్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాతినేని సుబ్రహ్మణ్యేశ్వ రరావు జ్ఞాపకార్థం వాటర్ ప్యూరిఫైర్, కూలర్ అందజేసినట్టు తెలిపారు. కూలర్ బహూకరణ పట్ల సెక్రటరీ విద్యాధర్, సచివాలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కొల్లిపర బాబి, లయన్స్‌క్లబ్ కోశాధికారి చిగు రుపాటి జగదీశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టికలు, ఫ్లెక్సీల చార్టులు అందజేత

గుడివాడ రూరల్, జూలై 12 : పిన్నమనేని నగర్, బాలకృష్ణ నగర్‌లలో



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తెలుగు అక్షర మాల, తెలుగు గుణింతాలు, అచ్చులు, హల్లులు, ఆంగ్ల సంఖ్యలు, గణిత పట్టికలు తదితర ఫ్లెక్సీల చార్టులను రోటరీ పూర్వ అధ్యక్షుడు ముళ్లపూడి రమణమూర్తి సౌజన్యంతో క్లబ్ తరపున అందించారు. క్లబ్ కార్యదర్శి జి.కిరణ్ బాబు, ఏజె.ప్రసాద్, సూర్యనారాయణ, నాగబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

గుడివాడ : సమాజ సేవా ట్రస్ట్ చైర్మన్ పంతగాని సురేష్ ఆధ్వర్యంలో నల్లమిల్లి డేవిడ్ రాజు 6వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు ప్రకాష్ శుక్రవారం పేదలకు, దివ్యాంగులకు భోజన ప్యాకెట్‌లను, అందజేశారు. ట్రస్ట్ సభ్యులు శేఖర్, సుభాని, వేణు పాల్గొన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల బహుకరణ

గుడివాడ : సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) జన్మదినం సందర్భంగా శుక్రవారం స్థానిక శాంతి వృద్ధాశ్ర మంలో వృద్ధులకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఆర్.కె వారియర్స్ శివ, చరణ్, శ్యామ్ పాల్గొన్నారు.

లే అవుట్‌ను తవ్వేస్తున్న మట్టి మాఫియా

అవనిగడ్డ, జూలై 12 : మండల పరిధిలోని తుంగలవారి పాలెంలో జగనన్న లేఅవుట్‌లో మెరక కోసం తోలిన మట్టిపై మట్టి మాఫియా కన్ను పడింది. దాదాపు 50 మంది లబ్ధిదారుల కోసం కేటాయించిన ఈ లే అవుట్ నుంచి శుక్రవారం ఉద యం మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తోలటంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయటంతో అధికారులు వచ్చేసరికి మట్టి మాఫియా పరారైంది.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ

మచిలీపట్నం టౌన్, జూలై 12 : సీజన్ మారుతున్న దృష్ట్యా గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బందరు మండలం కానూరు గ్రామంలో అతిసార వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలపై అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా సాయి సుస్వర, పి సాంబిరెడ్డి, పి రాజేంద్ర కుమార్, ఇజ్రాయిల్, సుధ, చెక్కా ఏడుకొండలు, దివి మహేష్, బొమ్మిడి ఏడుకొండలు, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, బోలిశెట్టి నాని, మోకా వెంకన్న, ఈవన సత్యనారాయణ, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మండలిపురంలో వైద్యశిబిరం

అవనిగడ్డ రూరల్, జూలై 12 : మండల పరిధిలోని మండలిపురంలో వేకనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రియాజ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ రెడ్డియ్య, ఏఎన్ఎం బేబీ షాలిని, భార్గవి, ఆశా వర్కర్లు కె.సంపూర్ణ, కె.పాప తదితరులు పాల్గొన్నారు.

కేసీపీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక చేయూత

కోడూరు, జూలై 12 : కేసీపీ ఉద్యోగి కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన కేసీపీ ఉద్యోగి గరికపాటి దేవ నాగమారుతి ఇటీవల మృతి చెందారు. తోటి ఉద్యోగులు రూ.65 వేలు సమకూర్చి రోటరీ ఉయ్యూరు ప్రెసిడెంట్ చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా శుక్రవారం నాగమారుతి కుటుంబసభ్యులకు అందజేశారు. కేసీపీ మేనేజర్ ఆర్.రామచంద్రరావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, జూలై 12 : వ్యాధులతో బాధపడుతు న్న రోగులకు సాయం చేస్తే దేవునికి సాయం చేసినట్టే అని టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. గొర్రెపాటి గోపీచంద్ సూచనల మేరకు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పోలిమెట్ల ప్రకాష్‌కు బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ రూ. 50 వేలు శుక్రవారం గోపీచంద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్నం సురేష్, పివిఫణికుమార్ పాల్గొన్నారు.



పౌష్టికాహారం పంపిణీ

మచిలీపట్నం టౌన్ , జూలై 12 : మచిలీపట్నంలోని పోర్టు రోడ్డులోని ప్రభుత్వ శిశుగృహకు శుక్రవారం మైత్రీ పౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. మైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుకుమార్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

మచిలీపట్నం టౌన్, జులై 12 : నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిం చాలని మచిలీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సూచించారు. శుక్రవారం మచిలీపట్నం 14వ డివిజన్ సుకర్లాబాద్ తదితర ప్రాంతాల్లో బండి రామకృష్ణ పర్యటించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. డ్రైన్లలో సిల్టు తీయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రత్నాకర్, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న మాజీ చైర్మన్ల ఫోటోలు

మచిలీపట్నం టౌన్, జూలై 12 : చారిత్రక మచిలీపట్నం మునిసిపాలిటీలో సేవలం దించిన మాజీ చైర్మన్ల ఫోటోలను కమిషనర్ చాంబర్‌లో ఉంచారు. తటవర్తి నాగపోతరావు, కొల్లిపర వెంకటరమణయ్య నాయుడు, సన్నాల వేణుగోపాలరావు, పేర్ని కృష్ణమూర్తి, చలమలశెట్టి వెంకటలక్ష్మీ, బచ్చుల అర్జునుడు, షేక్ సిలార్‌దాదా, మోటమర్రి బాబా ప్రసాద్, మోకా వెంకటేశ్వరమ్మలతో పాటు ప్రస్తుత మేయర్‌గా ఉన్న చిటికిన వెంకటేశ్వరమ్మ ఫోటోలను ప్రదర్శించారు. ఇలా మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఛాయా చిత్రాలను సేకరించి ప్రదర్శించారు. ఈఛాయా చిత్రాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ ఛాయా చిత్రాలతో పాటుగా కమిషనర్ ఛాంబర్‌లో ముఖ్య మంత్రి, ఉపముఖ్యమంత్రి, జాతీయ నాయకుల చిత్రపటాలు ఉంచారు.

హౌసింగ్ బోర్డులో దొంగతనాలు!

ఊరెళితే చాలు తాళాలు పగలకొడుతున్న దొంగలు

మచిలీపట్నం టౌన్, జూలై 12 : మచిలీపట్నం హౌసింగ్ బోర్డులో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. తాళాలు వేసి బంధువులు, స్నేహితుల ఇళ్ళకు వెళితే తాళాలు పగులకొట్టి మరీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత ఐదు రోజుల్లో తాళాలు వేసిన ఇళ్ళను టార్గెట్‌గా చేసుకుని దొంగలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. విశ్రాంత ఉద్యోగి హరిబాబు ఇంట్లో ఇటీవల 108 గ్రాముల వెండి వస్తువులు, కొంత నగదు చోరీ జరిగింది. ఈ సంఘటన నగర ప్రజలు మరువకముందే విశ్రాంత ఉపాధ్యాయుడు సాయినాథ్ మల్లిఖార్జునరావు ఇంటిని దొంగలు టార్గెట్‌గా చేసుకుని తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. అయితే వస్తువులు దొంగతనం చేసేందుకు వీలు కాలేదు. నిందితులు పరారయ్యారు. దీనిపై చిలకలపూడి సీఐ సతీష్‌ను వివరణ కోరడం జరిగింది. సాయినాథ్ మల్లిఖార్జునరావు ఇంటి వద్ద ఉన్న సిసి కెమెరాలను చూశామని, ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.